# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 94 | ఆదివారం 07, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## విశాఖ వన్డేలో భారత్ ఘన విజయం




**మూడో వన్డేలో**
**దక్షిణాఫ్రికాను చిత్తు**
**చేసిన భారత్**
**2-1 తేడాతో వన్డే**
**సిరీస్ కైవసం**
**అజేయ సెంచరీతో**
**చెలరేగిన యశస్వి జైస్వాల్**
**చెరో నాలుగు వికెట్లతో సత్తా**
**చాటిన కుల్దీప్, ప్రసిద్ధ్ కృష్ణ**

**వైజాగ్, (ప్రజాస్వరం):**

దక్షిణాఫ్రికాతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో టీమిండియా జయభేరి మోగించింది. విశాఖపట్నం ఏసీఏవీడీసీఏ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో సఫారీ జట్టును చిత్తు చేసి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 21 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి వన్డేలో భారత్ నెగ్గగా, రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలిచింది. దీంతో ఇరు జట్లకు కీలకంగా మారిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. 271 పరుగుల లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతమైన శుభారంభాన్ని అందించారు. రోహిత్ శర్మ (75) దూకుడుగా ఆడగా, యశస్వి జైస్వాల్ (116 నాటౌట్) అజేయ సెంచరీతో ..మిగతా 2లో



### భారత ఆర్థికవ్యవస్థ
## దూసుకెళ్తోంది

**8.2 శాతం జీడీపీ**
**వృద్ధి సాధించాం**
**ప్రపంచం ఆర్థికంగా**
**క్లిష్ట పరిస్థితుల్లో ఉంది**
**అయినా భారత్**
**దూసుకెళ్తోంది**
**క్రమశిక్షణ, సంస్కరణల**
**వల్లే ఇది సాధ్యమైంది**
**ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం పెరుగుతున్న వేళ భారత్ ఆర్థిక వృద్ధిలో శరవేగంగా దూసుకెళుతోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. హిందుస్థాన్ టైమ్స్ నిర్వహించిన లీడర్‌షిప్ సమిట్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశం నమోదు చేసిన 8.2 శాతం జీడీపీ వృద్ధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారత్ చోదక శక్తిగా మారుతున్నదని వ్యాఖ్యానించారు. మోదీ మాట్లాడుతూ, 21వ శతాబ్దంలో ..మిగతా 2లో

### కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని
## దోచేసింది

**పదేండ్లలో రూ. 8 లక్షల కోట్ల అప్పులు**
**పేదలకు కనీసం రేషన్ కార్డు ఇయ్యలే**
**నల్లగొండపై కక్షగట్టి**
**ఎస్ ఎల్ బీసీ పట్టించుకోలె**
**ఆరునూరైనా టన్నెల్‌ను పూర్తి చేసి తీరతాం**
**బీఆర్ఎస్ పార్టీకి కేటీఆరే పెద్ద గుదిబండ..**
**ప్రజా ప్రభుత్వంలో అన్నివర్గాలకూ న్యాయం**
**రాష్ట్రంలో 3 కోట్ల మందికిపైగా సన్నబియ్యం**
**4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం**
**తెలంగాణ సమగ్రాభివృద్ధి**
**చాటేందుకే గ్లోబల్ సమ్మిట్**
**క్వార్టర్, హాఫ్, ఫుల్‌కు ఆశపడి పొంకనాల**
**పోషిగాళ్లకు ఓటెయొద్దు**
**మంచోళ్లను సర్పంచులుగా గెలిపించాలి**
**దేవరకొండలో ప్రజాపాలన**
**విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**



**నల్లగొండ, (ప్రజాస్వరం):**

పదేండ్ల బీఆర్ ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల సంపదను కేసీఆర్ కుటుంబం దోచేసిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మిగులు రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారన్నారు. కేసీఆర్ పాలనలో పేదలకు అన్నివిధాలా అన్యాయం జరిగిందన్నారు. అందుకే గడీల పాలనకు స్వస్తి పలికి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారన్నారు. రెండేళ్లలో తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. భవిష్యత్‌లో దేశానికే ఆదర్శంగా ..మిగతా 2లో



## చారిత్రాత్మకంగా గ్లోబల్ సమ్మిట్

**ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తాం**
**అతిథులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం**
**పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం**
**ప్రపంచపటంలో**
**హైదరాబాద్‌ను నిలబెడతాం**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,**
**ఐటీ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను, భవిష్యత్తు వ్యూహాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ..మిగతా 2లో

### విమానాల ఆలస్యానికి
## ఇండిగోదే బాధ్యత

**ప్రయాణికులకు**
**అదనపు భారం వేయొద్దు**
**ఎయిర్ లైన్స్ టికెట్ ధరలు పెంచొద్దు**
**ఇండిగో తన ప్రయాణికులకు**
**రీఫండ్ ఇవ్వాల్సిందే**
**విమానయానశాఖ మంత్రి**
**రామ్మోహన్ నాయుడు**

02



### విజయోత్సవాల పేరిట
## ప్రభుత్వ ధనం దుబారా

**చేసింది లేక,**
**చెప్పకునేది లేక గప్పాలు**
**రైతులపాలిట**
**శాపంగా కాంగ్రెస్ పాలన**
**రైతు వ్యతిరేక విధానాలు**
**మాజీ మంత్రి హరీష్ రావు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ధనం దుబారా చేస్తుందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా శనివారం ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. చేసింది లేక, చెప్పుకునేది లేక కాంగ్రెస్ నేతలు గప్పాలు కొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని, రైతు వ్యతిరేక విధానాలతో నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం నర్సంపేట నియోజకవర్గంలోని, ఖానాపూర్ మండలం, ధర్మారావుపేట గ్రామంలో యూరియా కోసం రైతులు పడుతున్నఅగచాట్లు ఇవి అని ఎక్స్ లో పోస్టు చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయడం చేతగాని ప్రభుత్వం అని, ఉత్తర కుమార ప్రగల్భాలు ..మిగతా 2లో

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

**నూతన లేబర్ కోడ్లను**
**తెలంగాణలో అమలు చేయొద్దు**
**లేబర్ కోడ్లను ఆపేదాక**
**అసెంబ్లీ, మండలిని స్తంభింపజేస్తాం**
**వరంగల్ లో త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం**
**ఇండిగో ఒత్తిడికి తలొగ్గిన కేంద్రమే**
**శ్రమదోపిడీ వల్లే ఉపద్రవాలు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

03



## కమలాపూర్‌లో ఈటల సుడిగాలి ర్యాలీ

**నేను ఈ ఊరి బిడ్డను**
**ప్రజల ఓటే నా బలం**



02




# విశాఖ వన్డేలో భారత్ ఘన విజయం..

**మొదటిపేజీ తరువాయి**

కదం తొక్కాడు. జైస్వాల్ స్కోరులో 12 ఫోర్లు, 2 సిక్సులు ఉన్నాయి. రోహిత్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (45 బంతుల్లో 65 నాటౌట్) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, దక్షిణాఫ్రికాను 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌట్ చేసింది. సఫారీ జట్టులో ఓపెనర్ క్వింటన్ డి కాక్ (106) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ బవుమా (48) ఫర్వాలేదనిపించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో నాలుగు వికెట్లతో సఫారీ పతనాన్ని శాసించారు. అర్షదీప్ సింగ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టారు.

# భారత ఆర్థికవ్యవస్థ దూసుకెళ్తోంది

**మొదటిపేజీ తరువాయి**

నాలుగో వంతు గడిచిపోయిన ఈ సమయంలో ప్రపంచం ఎన్నో అనిశ్చితులను ఎదుర్కొంటోందని చెప్పారు. ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక రంగాల్లో దేశాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, మరోవైపు యుద్ధాలు ప్రపంచంతో పాటు మార్కెట్లను కూడా అస్థిరత వైపు నెట్టుతున్నాయని పేర్కొన్నారు. "ప్రపంచం మందగమనంపై ఆందోళన చెందుతుంటే, భారత్ మాత్రం వృద్ధిలో కొత్త అధ్యాయాలు రాస్తోంది. ప్రపంచం అపనమ్మకంతో నిండిపోతుంటే భారత్ నమ్మకానికి కేంద్రంగా నిలుస్తోంది. ప్రపంచం విభజన వైపు సాగుతున్న వేళ ఐక్యతకు భారత్ వారధిగా మారుతోంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు.




క్యూ2లో 8.2 శాతం జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, భారత ఆర్థిక వ్యవస్థ యొక్క దృఢతకు ఇది సూచిక అని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి సగటు 3 శాతం, జీ7 దేశాల వృద్ధి 1.5 శాతం వద్ద ఉండగా భారత్ అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణంతో ముందుకు సాగుతున్నదని ఆయన అన్నారు. అధిక ద్రవ్యోల్బణం గురించి ఒకప్పుడు ఆందోళన చెందిన వారే ఇప్పుడు భారత ద్రవ్యోల్బణ నియంత్రణను ప్రశంసిస్తున్నారని గుర్తుచేశారు.

గడిచిన దశాబ్ద కాలంగా చేపట్టిన సంస్కరణలు, ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడి వాతావరణం మెరుగుదల వల్లే ఈ పురోగతి సాధ్యమైందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచ అనిశ్చితుల మధ్య భారత్ బలంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

# విజయోత్సవాల పేరిట ప్రభుత్వ ధనం దుబారా

**మొదటిపేజీ తరువాయి**

పలుకుతుందని మండిపడ్డారు. గ్లోబల్ సమ్మిట్ అంటూ, విజన్ 2047 అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని, ముందు రైతులకు యూరియా సరఫరా చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. వ్యవసాయ ప్రణాళికను గాలికి వదలి రైతులు, మహిళలు, వృద్ధులు అందర్నీయూరియా కోసం గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబెడే పరిస్థితి తెచ్చావు అని మండిపడ్డారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని, మీ రైతు వ్యతిరేక విధానాతో రైతులు నరకం చూస్తున్నారన్నారు. గత సీజన్ యూరియా కష్టాలు, చేదు అనుభవాల నుంచి మీరు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏం నేర్చుకోకపోవడం సిగ్గుచేటన్నారు. సీజన్ ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే, మున్ముందు పరిస్థితి ఇంకా ఎంత దారుణంగా ఉంటుంది? యూరియా కొరత రాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన, వాస్తవాలు మరుగున పడిపోవు కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలు మరిచిపోరు అని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం మాత్రమే ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని ఆరు కేజీలకు పెంచి, కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చింది అబద్ధమా? అని ప్రశ్నించారు. నల్లగొండ ప్రజల మీద కక్ష కట్టింది ఎవరు, ఎస్ ఎల్ బీ సీ ప్రాజెక్టును నెవర్ ఎండింగ్ ప్రాజెక్టుగా డిజైన్ చేసింది ఎవరు? ప్రాజెక్టును పడావు పెట్టింది ఎవరు?బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3892 కోట్లు ఖర్చు చేసి, 11.48 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తి చేసింది నిజం కాదా? ఈ లెక్కలు మీ ప్రభుత్వం దగ్గర లేవా? పదే పదే ఎందుకు అబద్ధాలు చెబుతున్నారని నిలదీశారు.

**హోంగార్డుల సేవలు అమూల్యం**

ప్రజా భద్రత, విపత్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణలో హోంగార్డులు అందిస్తున్న సేవలు అమూల్యం అని హరీష్ రావు పేర్కొన్నారు. హోంగార్డుల




సేవలను గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ. 9000 గా ఉన్న వేతనాన్ని, రూ.27,600కు పెంచిందన్నారు. ట్రాఫిక్ లో విధులు నిర్వహించే వారికి 30% రిస్క్ అలవెన్స్ ఇచ్చిందని, మహిళా హోంగార్డులకు ప్రసూతి సెలవులు ఇచ్చి ఆత్మ గౌరవం పెంచిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ కేవలం బీఆర్ఎస్ ఇచ్చిన రోజువారీ వేతనం రూ.921కి మరో 79 కలిపి మొత్తం రూ.వెయ్యి చేసి ఎంతో చేసినట్టుగా గప్పాలు కొట్టడం నయ వంచనే అవుతుందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అవి అమలు చేయకపోగా, తన వికృత చేష్టలతో హోంగార్డులను తీవ్రంగా అవమానిస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మందికి పైగా ఉన్న హోంగార్డులతో ఎన్నో పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం, పోలీసుశాఖ.. వారి సంక్షేమాన్ని మాత్రం గాలికొదిలింది. వారి బతుకులను రోడ్డు పాలు చేసిందన్నారు. రెండేళ్ల కాలంలో 60 మంది పైగా హోంగార్డులు చనిపోయారు. అందులో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారికి తప్ప సహజ మరణం ఏ ఒక్కరికి 5 లక్షలు అందించని దుస్థితి అన్నారు. కారుణ్య నియామకాలు జరపక పోవడం,ఎక్స్ గ్రేషియా అందించకపోవడంతో హోంగార్డుల కుటుంబాలు అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని, కారుణ్య నియామకాలు ఇస్తామని, హెల్త్ కార్డులు, వీక్లీ ఆఫ్‌లు ఇప్పిస్తామని,హామీలు ఇచ్చిన రేవంత్ ఒక్కటి కూడా అమలు చేయకుండా, హోంగార్డుల పట్ల కక్ష కట్టారని, కాంగ్రెస్ పాలనలో రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆర్డర్లీ వ్యవస్థ రద్దు, ఇతర అలవెన్స్‌లు అనేవి రేవంత్ గాలిమాటలుగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచేసింది

**మొదటిపేజీ తరువాయి**

నిలుపుతామని పేర్కొన్నారు. శనివారం నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధ్యక్షత ప్రజాపాలన విజయోత్సవ సభ లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి ఈ సం దేవరకొండలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, జూనియర్ కళాశాలలో స్టేడియం, వాకింగ్ ట్రాక్, బీఎస్ఆర్ కాలనీలో పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శేరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ప్రసగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం విస్మరించిందన్నారు. పేదలకు కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మండిమడ్డారు. ఒక్క దేవరకొండలోనే 14 వేల రేషన్‌కార్డులు ఇచ్చామని రాష్ట్రంలోనే ఇది అత్యధికమని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేసి పేదల ఆకలి తీరుస్తున్నామన్నారు. దేశంలోని ఏరాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం ఇవ్వడం లేదన్నారు.

**పేదలకు భరోసా**

రాష్ట్రంలో పేదలందరికీ గూడు నిర్మించి ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 2014 వరకు మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి 25 లక్షల ఇండ్లు నిర్మించి భోరసా ఇచ్చారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇస్తానని దారుణంగా మోసగించిందని ఆరోపించారు. కేసీఆర్ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కొనసాగించి ఉంటే పదేండ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మించే అవకాశముండేదని పేర్కొన్నారు. పేదల ఇంటికి రూ. 2 లక్షలు ఇవ్వని కేసీఆర్ తానుమాత్రం 2 వేల కోట్లతో ఇంటిని నిర్మించుకొని భోగాలు అనుభవించారని మండిపడ్డారు. ప్రజాప్రభుత్వంలో పేదల ఆత్మగౌరవం నిలిపేలా రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు వెల్లడించారు. రూ. 22, 500 కోట్లతో రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇండ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. చెంచులు, ఐటీడీఏ ప్రాంతాల్లో పేదలకు 25 వేల ఇండ్ల నిర్మాణానికి ప్రత్యేక జీఓ ఇచ్చినట్లు గుర్తు చేశారు. లంబాడీలను ఎస్టీలో చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

**ఉచిత విద్యుత్ పేటెంట్ మాదే**

గత ప్రభుత్వం నాలుగు విడతల్లో రైతులకు రూ. లక్ష పంట రుణమాఫీ చేస్తే వడ్డీకే సరిపోయిందన్నారు. రాష్ట్రంలోని 25 లక్షల 35 వేల మంది రైతులకు 20,614 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేసిన ఘనత ప్రజాప్రభుత్వానిదేనని చెప్పారు. సాగుకు ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి 2004లోనే రూ.12,400 కోట్లతో రైతుల వ్యవసాయ మోటార్ల బిల్లులు మాఫీ చేశారని గుర్తు చేశారు.

**బీఆర్ఎస్‌కు కేటీ ఆర్ గుదిబండ**

నాలుగురు సర్పంచ్‌లు, వార్డులను కూర్చోబెట్టుకొని మాట్లాడే స్థితికి మాజీ సీఎం కేసీఆర్ చేరారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ అరాచకాలకు బయపడే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ అధికారం ఊడగొట్టి పార్లమెంట్ ఎన్నికల్లో సున్నాచుట్టించారని ఎద్దేవా చేశారు. మొన్నరెఫరెండమ్ అని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు వెళ్తే బోరబండ దగ్గర ప్రజలు బండకేసి బాది బొందపెట్టారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీకి కేటీఆరే గుదిబండని ఆ బండ ఉన్నన్ని రోజులు ఆ పార్టీని ప్రజలే బొందపెడతారన్నారు. ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలకు అన్నివిధాలా న్యాయం జరిగిందన్నారు.

**తెలంగాణ మంచి రోజులు**

కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ప్రజలకు మంచి రోజులు వచ్చాయని సీఎం పేర్కొన్నారు. ప్రజాపాలనలో పేదలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్న బియ్యం, రేషన్ కార్డు ఇలా ఎన్నో సంక్షేమాలు వచ్చాయన్నారు. రెండేళ్లలో నిరుద్యోగ యువతకు 61 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు.



**ఎస్ ఎల్ బీసీ పనులపై వివక్ష**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ ఎల్ బీసీ ప్రాజెక్ట్ ను రూ. 2 వేల కోట్లతో పనులను ప్రారంభించి 30 కిలోమీటర్లు టన్నెల్ పూర్తి చేస్తే నల్లగొండ ప్రజలపై పగబట్టి గత ప్రభుత్వం పెండింగ్ పనులు కంప్లీట్ పనులు చేయకుండా వివక్ష చూపిందన్నారు. ఎస్ ఎల్ బీసీ సొరంగ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు 8 మంది చనిపోతే ఇక పనులు జరగమని మామా అల్లుళ్లు పైశాచిక ఆనందంతో డ్యాన్స్ చేశారని పరోక్షంగా మాజీ సీఎం, హరీశ్‌రావులను సీఎం రేవంత్ విమర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావు నాగార్జున సాగర్ , శ్రీశైలంలో బండ కట్టుకుని దూకినా ఎస్ ఎల్ బీసీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టు పూర్తి చేసి దేవరకొండ ప్రజల తాగు, సాగునీటి కష్టాలు తీరుస్తామన్నారు. దేవరకొండ ప్రాంత అభివృద్ధి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

**దేవరకొండకు వరాల జల్లు**

దేవరకొండలో దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి చదువుకున్న పాఠశాలకు రూ. 6 కోట్ల నిధులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పూర్తి చేసే బాధ్యత తానే తీసుకుంటానని చెప్పారు. దేవరకొండలో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి వెంటనే అంచనాలు రూపొందించాలని సభా వేదికగా కలెక్టర్‌ను ఆదేశించారు. నియోజవర్గంలో రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ నెలాఖరులోపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మంత్రి సీతక్కను పంపి అన్ని పనులకు అంచనాలు రూపొందించి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**మద్దిమగుడును మరింత అభివృద్ధి చేస్తాం**

దేవరకొండ వెంటే ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్దిమడుగు పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8, 9న మహేశ్వరంలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమాలను ప్రపంచానికి కళ్లకు కట్టినట్లు చూపిస్తామన్నారు. దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు సమ్మిట్‌కు రానున్నట్లు చెప్పారు.

**అన్నింటిలో నెంబర్ వన్**

ధాన్యం ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. విద్య, వైద్యం, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. దేశానికి తెలంగాణను రోల్ మోడల్‌గా నిలుపుతామన్నారు. క్వార్టర్, హాఫ్, ఫుల్‌కు ఆశపడి స్థానిక ఎన్నికల్లో పొంకనాల పోషిగాళ్లకు ఓటెయొద్దని, మంచి వారికి అవకాశం ఇచ్చి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవరకొండ, నాగార్జున సాగర్, మిర్యాలగూడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు నేనావత్ బాలూనాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# విమానాల ఆలస్యానికి ఇండిగోదే బాధ్యత

- **ప్రయాణికులకు అదనపు భారం వేయొద్దు**
- **ఎయిర్ లైన్స్ టికెట్ ధరలు పెంచొద్దు**
- **ఇండిగో తన ప్రయాణికులకు రీఫండ్ ఇవ్వాల్సిందే**
- **విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఇండిగో విమానాల రద్దు, సిబ్బంది సమస్యల వల్ల దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండడంతో కేంద్ర ప్రభుత్వం కఠినంగా స్పందించింది. విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితిలో ఎయిర్‌లైన్స్ టికెట్ ధరలను పెంచకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రయాణికులపై అదనపు భారం వేయకూడదని కేంద్రం అన్ని ఎయిర్‌లైన్‌లకు సూచించినట్టు చెప్పారు.

ఇండిగో సంక్షోభంపై మాట్లాడుతూ రామ్మోహన్ నాయుడు, ఎఫ్‌డీటీఎల్ నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఆరోపణలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ కమిటీ పూర్తి



స్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించిన తర్వాత అవసరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని అన్నారు. ఇండిగో విమానాల రద్దుపై సంస్థ నుంచి అధికారిక సమాధానం తప్పనిసరిగా రావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం అత్యవసర చర్యల్లోకి దిగింది. రైల్వే శాఖ ఇప్పటికే కొన్ని రూట్లలో ప్రత్యేక రైళ్లు నడపడం ప్రారంభించిందని తెలిపారు. అలాగే ప్రయాణికుల రీఫండ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇండిగోకు ఆదేశాలు జారీ చేశామని, రేపు రాత్రి 8 గంటల్లోపు పూర్తిస్థాయి రీఫండ్ ఇవ్వాల్సి ఉంటుందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ప్రభుత్వ మంత్రిత్వశాఖ పూర్తి దృష్టి ప్రయాణికులపైనే ఉందని, ఈ సమస్య త్వరలోనే పరిష్కార దిశగా సాగుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

# చారిత్రాత్మకంగా గ్లోబల్ సమ్మిట్

**మొదటిపేజీ తరువాయి**



ముఖ్య వివరాలు వెల్లడించారు. మంత్రి శ్రీ ధ ర్ బా బు తో కలిసి శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ సమిట్ ద్వారా తెలంగాణని గ్లోబల్ మ్యాప్‌పై మరింత స్పష్టంగా నిలపాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. "ఈ సమిట్ తెలంగాణ భవిష్యత్ దిశను నిర్ణయిస్తుంది. మా విజన్ డాక్యుమెంట్ ద్వారా రాష్ట్ర అభివృద్ధి సామర్థ్యాన్ని, పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చూపించబోతున్నాం. ఇంత విస్తృతంగా, ఇంత పెద్ద స్థాయిలో జరగబోయే సమిట్ ఇది మొదటిసారి," అన్నారు.

**27 ప్రత్యేక సెషన్లు – ప్రపంచ నిపుణుల సమాగమం**

రెండురోజుల పాటు జరిగే ఈ సమిట్‌లో మొత్తం 27 సెషన్లు ఉంటాయని ఆయన వివరించారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్ ఎనర్జీ, అర్బన్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రీ, హెల్త్, ఎడ్యుకేషన్ తదితర రంగాలపై దేశ విదేశాల నిపుణులు పాల్గొంటారని తెలిపారు. ప్రపంచంలోని ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు, పాలసీ నిపుణులు, పెట్టుబడిదారులకు ఆహ్వానాలు పంపినట్టు వెల్లడించారు.

**ఎయిర్‌లైన్స్ అంతరాయం**

ఇటీవల దేశంలో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయాలపై స్పందించిన భట్టి విక్రమార్క, "ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం. సమిట్‌కు హాజరయ్యే ముఖ్యఅతిథులు, కీలక ప్రతినిధులకు ఏ అసౌకర్యం రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. అవసరమైతే వారికి ప్రత్యేక విమాన సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తాం," అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రతినిధులు సమిట్‌కు రానుండటం రాష్ట్రానికి గర్వకారణమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "ఇంత పెద్ద స్థాయిలో, ఇన్ని దేశాల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం గతంలో ఎప్పుడూ జరగలేదు. తెలంగాణ సామర్థ్యాన్ని అంతర్జాతీయ వేదికపై నిలుపుకునే చారిత్రాత్మక అవకాశం ఇది," అని భట్టి విక్రమార్క గర్వంగా తెలిపారు.


# కమలాపూర్‌లో ఈటల సుడిగాలి ర్యాలీ

- **నేను ఈ ఊరి బిడ్డను... ప్రజల ఓటే నా బలం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

సర్పంచ్ ఎన్నికల ప్రచారం కమలాపూర్‌లో ఊపందుకుంది. ప్రచార కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ భారీ ర్యాలీలో పాల్గొని గ్రామమంతా నడిచి ప్రజలను అభివాదించారు. ప్రతి ఇంటి వద్ద ఆగి ఓటు వేయాలని కోరారు. ర్యాలీలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ నేను ఈ ఊరి బిడ్డను ఈ మట్టిలో పుట్టి పెరిగిన వాడిని అని భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. మన అభ్యర్థి సతీష్‌కి లిక్కర్ వ్యాపారం లేదు, భూముల వ్యాపారం లేదు... కో అంటే కో అన్నోడుగా పేర్కొన్నారు. ఎన్నికలు కులాలకు, రంగులకు సంబంధించినవికాదని, "ప్రజల బ్రతుకులకు సంబంధించిన యుద్ధం ఇది అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎర్రచీమకైనా అన్యాయం చేయలేదు. నన్ను ఈ స్థాయి వరకూ తీసుకువచ్చింది కమలాపూర్ గడ్డ అని ఈటల స్పష్టం చేశారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈటల మండిపడ్డారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలుగా సర్పంచుల బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. కేంద్ర నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు, పంచాయతీ, అంగన్వాడీ, హాస్పిటల్ భవనాలు, రైతు వేదికలు నిర్మితమయ్యాయి అని విమర్శలు గుప్పించారు. రియల్ ఎస్టేట్ డబ్బులతో ఓట్లు కొని గెలిచే వాళ్ల కాలు దొరకదు. ఓటుకు విలువ ఉంది ఆత్మగౌరవం



ఉంది" అంటూ బహిరంగంగా హెచ్చరించారు.

**ప్రజలకు అభయాన్ని ఇస్తూ ఈటల భరోసా ఇచ్చారు**

సతీష్‌ను గెలిపిస్తే మళ్లీ పాత రోజుల లాగా పని చేస్తా. పెన్షన్, రేషన్ కార్డ్, డబుల్ బెడ్ రూమ్ గ్రామానికి ఏం కావాలన్నా మేమే ఇప్పిస్తాం అన్నారు. సర్పంచ్ అభ్యర్థి సతీష్ మాట్లాడుతూ 22 ఏళ్లుగా విలేకరిగా పనిచేశా... ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు తెచ్చాను అన్నారు. ఎవరికి ఆరోగ్య సమస్యలున్నా, రక్తం కావాలన్నా నేను కేరాఫ్ అడ్రస్ అని గుర్తుచేశారు. మీ ఇంటి బిడ్డను ఒక్క ఫోన్‌కాల్‌తో అందుబాటులో ఉంటా. ఈటల గారి సేవా తత్పరతను పునికి పుచ్చుకొని ఆయన ప్రతినిధిగా సేవ చేసేందుకు మీ ముందుకు వచ్చాను" అని ప్రకటించారు. చివరగా ప్రజలను కోరుతూ సతీష్ సర్పంచ్‌గా గెలిపించి ఈటల రాజేందర్ గారికి గిఫ్ట్‌గా ఇవ్వండి. మళ్లీ ఆయన్ను కమలాపూర్‌కు రావడానికి బాట వేయండి" అంటూ విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
07.12.2025
ఆదివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com




## సాంకేతిక విద్యార్థులకు నైపుణ్యత ఎంతో అవసరం.

- **ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ విద్యలో ఐకాన్..**
- **ఆచార్య జి. యస్. యన్. రాజు.**

**విశాఖపట్నం, డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

బిటెక్ చదివే విద్యార్థులకు తాము చదువుతున్న సాంకేతిక విద్య పట్ల ప్రత్యేకమైన స్కిల్స్ కలిగి ఉండాలని ఆచార్య జిఎస్ఎన్ రాజు అన్నారు.. శనివారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ విభాగం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు, స్కాలర్లు విద్యార్థులు సిబ్బంది ఆచార్య జిఎస్ఎన్ రాజు ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సమయస్ఫూర్తి ఎంతో అవసరం అన్నారు. ముఖ్యంగా సాకేతిక విద్యార్థులు ముందు చూపుతో, అంకితభావంతో సాఫ్ట్ స్కిల్ కలిగి ఉండాలి అన్నారు. అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ నిత్యజీవితంలో సమయస్ఫూర్తితో ఎదుర్కొన్న అనేక విమర్శలను ఎలా ఎదుర్కొన్నారు తెలియజేశారు. ఇలా నిత్య జీవితంలో జరిగిన అనేక వాస్తవిక కథనాలను విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించేలా వివరించారు. పొగడ్తలు ఎప్పుడూ చాలా మధురంగా ఉంటాయని, అతి మధురం చాలా ప్రమాదకరమని గమనంలో ఉంచుకోవాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం బంగారు తో సమానం అని ప్లాటినం స్థాయికి ఎదగాలని కోరారు.. కష్టపడే తత్వం ఇంజనీరింగ్ విద్యార్థి దశ నుండి అలవర్చుకోవాలని, లిజనింగ్ స్కిల్ తో పాటు, కమ్యూనికేషన్ స్కిల్ కూడా ఎంతో కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు.. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విద్యార్థి రంగంలో ఆచార్య జీఎస్ఎం రాజు ప్రత్యేక ఐకాన్ లాంటి బ్రాండ్ అంబాసిడర్ అని, కులపతిగానే కాకుండా విద్యార్థులకు అన్ని విధాల దళపతిగా సహాయ సహకారాలు అందిస్తారని, చదువుల రారాజు జీఎస్ఎం రాజు విజ్ఞాన గని అని , విద్యారంగం తో పాటు క్రీడా వ్యాయామ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కలిగినటువంటి అరుదైన వ్యక్తిగా అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విభాగంలో విద్యార్థిగా జేఎస్ఎన్ రాజు సాంకేతిక విద్యా ప్రయాణం దశలవారీగా ఆచార్యులుగా సహాయ ప్రిన్సిపాల్ , డీన్, ప్రిన్సిపాల్, తదుపరి ఉపకులపతిగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వారి సేవలు అజరామమన్నారు. నేడు కులపతిగా సాంకేతిక విద్య పట్ల ఆయన అందిస్తున్న సేవలు, ఎంత ఎత్తు ఎదిగిన ఒదిగుండే తత్వం నేటి విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు.. వంద సంవత్సరాల వేడుకల్లో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ఆచార్య పీవీ శ్రీదేవి, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణ్ లతో పాటు పలువురు ఈ సందర్భంగా జిఎస్ఎన్ రాజు ని ఘనంగా సన్మానించారు.

## సమానత్వం, న్యాయం కోసం పోరాడిన యోధుడు డా. బి.ఆర్. అంబేద్కర్

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ**
- **డిసిసి లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు**

**ఖమ్మం డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

సమానత్వం, న్యాయం కోసం పోరాడిన యోధుడు డా. బీ ఆర్ అంబేద్కర్ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ అన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసన సభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వర రావు, రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు వడ్డే బోయిన నరసింహారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు రాపర్తి శరత్, కన్నం వైష్ణవిప్రస్సన్నకృష్ణ, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, మరియు పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాలకు భారతదేశంలో రక్షణ కల్పించిన మహనీయుడు బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. బలహీన వర్గాల రిజర్వేషన్ల కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరవలేనిదని అన్నారు. భరత జాతి ఉన్నంతకాలం అంబేద్కర్ను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయి కుమార్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్ నగర కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు, షేక్ అబ్బాస్ బేగ్, కిలారి అనిల్ కుమార్, సంపటం నరసింహారావు, గడ్డం వెంకటయ్య, బీరెడ్డి రమేష్, నారాయణ, కాళంగి కనకరాజు, బెజ్జం గంగాధర్, వసీం, రజీ, జహీర్, మహమూద్,కిరణ్, సుదర్శన్, యశ్వంత్, జయప్రకాష్ నాయుడు, చల్లా ప్రతిభారెడ్డి, బలుసు లక్ష్మీ, ఊరుకొండ చంద్రిక, సుకన్య, నీలవేణి, దామా స్వరూప, అన్నపూర్ణ, భూక్యా సురేష్ నాయక్, ఫజల్, రమాదేవి, నల్లమో తు రవి, తలారి నాగభూషణం తదితర నాయకులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

- **నూతన లేబర్ కోడ్లను తెలంగాణలో అమలు చేయొద్దు**
- **లేబర్ కోడ్లను ఆపేదాక అసెంబ్లీ, మండలిని స్తంభింపజేస్తాం**
- **వరంగల్ లో త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం**
- **ఇండిగో ఒత్తిడికి తలొగ్గిన కేంద్రమే**
- **శ్రమదోపిడీ వల్లే ఉపద్రవాలు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కేంద్రం తెస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అడ్డుకునేందుకు బీఆర్ఎస్, దాని అనుబంధ కార్మిక విభాగం బీఆర్‌టీయూ పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పుడు ఎన్నికలు లేనందున, రాజకీయాలకు అతీతంగా ఏ కార్మిక సంఘంతోనైనా కలిసి పనిచేస్తామని ప్రకటించారు. ఢిల్లీలో సోనియా గాంధీ వ్యతిరేకించిన బిల్లును తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. నూతన లేబర్ కోడ్లను తెలంగాణలో అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. ఈ కోడ్‌లను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారుతుందని, ఇందుకోసం ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతో పాటు, అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తామని, వరంగల్‌లో తదుపరి సమావేశం నిర్వహిస్తామని కార్యాచరణను ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో శనివారం కార్మిక సంఘాలతో లేబర్ కోడ్లపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంటు లేదా అసెంబ్లీలో జరిగే చర్చల కంటే ఈ సమావేశంలోనే మరింత అర్థవంతమైన చర్చ జరిగిందని అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. దేశం వైరుధ్యాల పుట్ట అన్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నులు ఉన్నారని, అదే సమయంలో అత్యంత పేదరికం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా, ఐరోపా దేశాల కోసం రూపొందించిన చట్టాలను, విధానాలను గుడ్డిగా ఇక్కడ అమలు చేయడం సరి కాదని, దేశంలోని భిన్నమైన సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో తెస్తున్న సంస్కరణలు స్థానిక పరిస్థితులను విస్మరిస్తున్నాయని, తెలంగాణలో 92 శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉండటమే ఇక్కడి పేదరికానికి నిదర్శనమని పేర్కొన్నారు.
కేసీఆర్ ఎప్పుడూ మానవీయ కోణంలోనే ఆలోచించేవారన్నారు. సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల కాలంలో రూ.3,500 కోట్ల విలువైన బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లను ఇచ్చి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించారని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా నేతన్నల ఆత్మహత్యలకు చలించిపోయి పార్టీ తరపున ఆర్థిక సాయం చేశారని, ప్రభుత్వాలు పేదలను, అణగారిన వర్గాలను విస్మరిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేదని, కానీ నేడు అది 60 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, భారత్ మాత్రం ఇంకా 4 ట్రిలియన్ల వద్దే ఉందని గుర్తు చేశారు. చైనా తన ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు విధానాలను మార్చుకుంటూ, నష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వ మద్దతునిస్తూ, లాభాల్లో ఉన్నప్పుడు ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించిందన్నారు. మనం మాత్రం అనవసరమైన విషయాలపై చర్చిస్తూ వెనుకబడిపోయామని విచారం వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న కార్పొరేట్ ఏకాధిపత్యం ప్రమాదకరమని హెచ్చరించారు. ఇటీవల జరిగిన ఇండిగో విమానయాన సంస్థ సంక్షోభాన్ని ఉదహరించారు. ఇండిగో సంస్థలో ఏర్పడిన సమస్యల వల్ల ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయని, విమానాశ్రయాలు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లను తలపించాయన్నారు. ఇది ముమ్మాటికీ శ్రమ దోపిడీ వల్లే జరిగిందని, అయినా కేంద్ర ప్రభుత్వం నిబంధనలు అమలు చేయకుండా ఆ సంస్థ ఒత్తిడికి తలొగ్గిందని విమర్శించారు. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే, ఇలాంటి అరాచకమే అన్ని రంగాలకు విస్తరిస్తుందని హెచ్చరించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ వర్ధంతి ని పురస్కరించుకొని ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాంబాబు, యాదగిరిగౌడ్, తుంగ బాలు, దేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దాం.

- **ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపు**

**వనపర్తి,డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

అంబేద్కర్ ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నా రెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తూడిమేగా రెడ్డి అంబేద్కర్ ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని పిలుపునిచ్చారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "నిరుపేదల అభ్యున్నతికి, సామాజిక న్యాయ స్థాపనకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు అపూర్వమైనవి. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ రాజ్యాంగం ప్రపంచానికి స్ఫూర్తి

- **చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఆర్టికిల్–3 మార్గదర్శకం: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి, డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ— డాక్టర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆర్టికిల్-3 వల్లే దేశంలో చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు దారులు తెరచుకున్నాయని, అదే విధంగా తెలంగాణ రాష్ట్రం అవతరణకు ఆ రాజ్యాంగ ప్రావధానాలే భూమికగా నిలిచాయని గుర్తు చేశారు. అలాగే, అంబేద్కర్ హరిజన, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడానికి చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన సమానత్వ మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నివాళుల కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్న యాదవ్, కంచె రవి, నీలస్వామి, సంపత్ రెడ్డి, కరుణాకర్, ఎర్రమన్యం, బషీర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## రియా ఫౌండేషన్ మరియు ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేద్కర్ కి, ఘన నివాళులు

- **డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన వైద్యా అధికారి హారిక, చైర్మన్ ఎండి రాజు**

**పరవాడ, డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

భారత రాజ్యాంగ రూపశిల్పి భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆ మహనీయుడు స్మరిస్తూ డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.హారిక, రియా ఫౌండేషన్ చైర్మన్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి రాజు ఈ మేరకు ఆ మహనీయుడు వర్ధంతి సందర్భంగా పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషెంట్ లకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రియా ఫౌండేషన్ చైర్మన్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి రాజు మాట్లాడుతూ డా.బి.ఆర్.అంబేద్కర్ మన భారత దేశానికి గొప్ప లిఖిత రాజ్యాంగాన్ని రచించి అందించారని సమానత్వం, న్యాయం, మరియు శక్తిసాధనకు సంకల్పంతో కృషి చేసిన గొప్ప మహనీయుడు అంటరానితనం వివక్షత లపై అలుపెరుగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత సమాజంలో అసమానతలు తొలగిపోవడానికి ఎనలేని కృషి చేసిన గొప్ప దార్శనికుడు బాబా సాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ ని ఈ రోజు ఆ మహనీయుడు వర్ధంతి సందర్భంగా స్మరిస్తూ అసోసియేషన్ సభ్యులతో కలిసి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తూ, అభివృద్ధి చెందిన భారతాన్ని నిర్మించడానికి ప్రయత్నిద్దామని ఎండి రాజు కొనియాడారు ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివలంక నర్సింగరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈరుగుల లక్ష్మీప్రసాద్, ఎస్ జీ మీడియా చైర్మన్ పైలా శ్రీనివాసరావు, రెడ్డి రాధకృష్ణ, పి.గణేష్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఈసీఐఎల్ చౌరస్తాలో అంబేద్కర్ వర్ధంతి

- **ఏఎస్‌రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన నివాళి.**

**కాప్రా, డిసెంబర్ 6(ప్రజాస్వరం):**

డాబీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఏఎస్‌రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా వద్ద ఘన నివాళులు అర్పించారు. డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ నేతృత్వంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.





## గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రవర్తన నియమావళికి అనుగుణంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, డిసెంబర్ 6(ప్రజా స్వరం ):**
జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రవర్తన నియమావళి కి అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో బహుళ దశల గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంలో, మునుపటి దశల్లో పోలింగ్ పూర్తయినప్పటికీ వెంటనే ఎన్నికల నియమ నిబంధనలు పూర్తి కావని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో మూడు దశలుగా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీలో ఎన్నికలకు సంబంధించి చివరి దశ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియామవళి వర్తిస్తుందని ఆయన తెలిపారు. జిల్లాలోని సంబంధిత గ్రామీణ ప్రాంతాల పరోక్ష ఎన్నికలు పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తన నియామవలి అమలులో ఉండదని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తించే విధంగా అభ్యర్థులు , రిటర్నింగ్ అధికారులు జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు.




## సాయి ఈశ్వర చారి త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది

**జవహర్ నగర్, డిసెంబర్ 6, ప్రజాస్వరం:**
బీసీ రిజర్వేషన్లు అమలు కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన సాయి ఈశ్వర్ చారి చరిత్రలో నిలిచిపోతాడని బీసీ నాయకులు అన్నారు. శనివారం జవహర్ నగర్ సర్కిల్ పరిధిలోని బాలాజీ నగర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర తెలంగాణ లో 42%రిజర్వేషన్ల రిజర్వేషన్లు కోసం ఆత్మబలిదానం సాయి ఈశ్వరచారి చిత్రపటానికి జవహర్ నగర్ బీసీల ఐక్యవేదిక అధ్యక్షుడు సోమాచారీ అధ్యక్షతన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, జవనగర్ మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్,హాజరైమాట్లాడుతూ చరిత్రలో ఆయన త్యాగంమరువలేనిదనీ, రిజర్వేషన్లు రాలేదని యువకులు ఎవరు అధైర్యతో ఆత్మహత్యలకు పాల్పడొద్దని పోరాటం చేసి తమ యొక్క హక్కులను సాధించుకుందాం అన్నారు. బీసీ ఉద్యమం కోసం అవసరమైతే మరో తెలంగాణ తరహా పోరాటాన్ని కొనసాగిద్దామని వారన్నారు ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కొట్లాడి బీసీ రిజర్వేషన్లు సాధించుకుందాం

**గజ్వేల్ 06 డిసెంబర్ ( ప్రజాస్వరం )**
సాయి ఈశ్వర చారి మృతికి కాంగ్రెస్ పార్టీయే కారణమని, అతని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం,ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తులతో సాయి ఈశ్వర చారికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించి, కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్ 42% చేస్తా అని హామీలు ఇచ్చి అమలు చేయని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. బీసీల పట్ల అవలంబిస్తున్న దొంగ వైఖరిని బిజెపి పార్టీ, కాంగ్రెస్ పార్టీల తీరును ప్రజలు గమనించి స్థానిక ఎన్నికలలో తగిన గుణపాఠం నేర్పాలని ప్రజలను కోరారు. సాయి ఈశ్వర్ చారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని కోటి రూపాయల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. యువత బలిదానాలు చేసుకోవద్దని బరి గీసి మన రిజర్వేషన్లు మనం సాధించుకుందామని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కళ్యాణకర్ నర్సింగరావు,మర్కంటి కనకయ్య, జఖీయుద్దిన్,మామిడి శ్రీధర్, నవాజ్ మీరా, మల్లేశం గౌడ్, బొగ్గుల చందు, శ్రీరామ్ శ్రీధర్, కూరాకుల సాయి తదితరులు పాల్గొన్నారు.







## గందరగోళం మధ్య అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

**నార్సింగి డిసెంబర్ 06 (ప్రజా స్వరం)**
గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికల నేపథ్యంలో శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ కోసం స్క్రూటినీ అనంతరం మండలం లోని 9 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ బరిలో 46 అభ్యర్థులు ఉండగా, నామినేషన్ ఉపసంహరణకు చివరి రోజు అయిన శనివారం రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉప సంహరించు కోగా చివరగా 42 మంది అభ్యర్థులు సర్పంచ్ బరిలో మిగిలారు. మండల వ్యాప్తంగా ఉన్న 80 స్థానాలకు స్క్రూటినీ అనంతరం 213 అభ్యర్థులు ఉండగా, 8 అభ్యర్థులు తమ నామినేషన్ లు ఉప సంహరించుకోగా 205 అభ్యర్థులు పోటీలో మిగిలారు. వార్డు సభ్యుల లో పెద్ద తండా 6, వల్లూరు నుంచి 4, జప్తి శివునూరు నుంచి 1, భీం రావు పల్లి 1, శంఖాపూర్ తాండా 2 వార్డు సభ్యుల స్థానాల కోసం ఒక్కరే నామినేషన్లు వేయగా మొత్తం 14 మంది ఏకగ్రీవంగా గా ఎన్నిక అయ్యారని ఎంపీడీఓ వంగా ప్రీతీ రెడ్డి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గం నుంచి ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు ప్రకటించాల్సి ఉండగా సాయంత్రం 6 గం దాటినా ప్రకటించక పోవడం తో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తూ వేచి చూశారు. ఇంతలో కార్యాలయ సిబ్బంది వచ్చి గుర్తుల పై అధికారుల నుంచి మంజూరి రాలేదని, శనివారం రాత్రి ఆలస్యంగా నైనా లేదా ఆదివారం ఉదయం 7 గం లకు కేటాయిస్తారని వెల్లడించారు. దీంతో అభ్యర్థులలో గందరగోళం, అసహనం నెలకొంది. పెద్ద పెద్ద మండలాలలో గుర్తులు ఇదివరకే ప్రకటించినా 9 గ్రామ పంచాయతీలే ఉన్న చిన్న మండలంలో ప్రకటించడానికి ఆలస్యం ఎందుకు అని ప్రశ్నించారు. ఎట్టకేలకు 6:30 గం లకు గుర్తులను కేటాయిస్తూ ప్రతులను గోడల పై అతికించారు.





## యూరియా ధరల దందాపై రైతుల్లో ఆగ్రహం

**దౌల్తాబాద్ డిసెంబర్ 6(ప్రజాస్వరం)**
మండలంలో యూరియా సరఫరా వ్యవహారంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దౌల్తాబాద్ కేంద్రంలోని జ్యోతి ఫర్టిలైజర్స్ వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ రూ.266 మాత్రమే ఉన్నప్పటికీ, దుకాణంలో మాత్రం రూ.350 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. దుకాణంలో ఉన్న రెట్లు కూడా అధిక ధర వసూళ్లను ధృవీకరిస్తున్నట్టు రైతులు పేర్కొన్నారు. సీజన్‌లో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో ఇలాంటి దందా జరగడం వల్ల పేద, చిన్న రైతులకు తీవ్రమైన భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ధరల నియంత్రణపై తరచూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ, నేల మీద పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు ఉన్న దుకాణాలే ఇలా అధిక ధరలు వసూలు చేస్తే రైతులకు రక్షణ ఎవరు అందిస్తారో చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఆ దుకాణంపై వెంటనే తనిఖీలు నిర్వహించి, రైతులను దోపిడీ చేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖను రైతులు డిమాండ్ చేస్తున్నారు.





## ప్రపంచ గర్వించదగ్గ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

- **గజ్వేల్ మాజీ శాసనసభ్యు లు నర్సారెడ్డి**
- **సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్ష రెడ్డి**
- **పిసిసి నాయకులు గంప వేణుగోపాలరావు**

**గజ్వేల్ 06 డిసెంబర్ ( ప్రజాస్వరం )**
ప్రపంచం గర్వించదగ్గ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాగా, అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్ హక్కుతో అండగా నిలిచిన ఆయన భారతజాతి ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచిపోతారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్ష రెడ్డి, పిసిసి నాయకులు గంప వేణుగోపాలరావు స్పష్టం చేశారు. శనివారం గజ్వేల్ లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వేడుకల్లో పాల్గొని వారు మాట్లాడారు. భారత దేశానికి దశాదిశా చూపించిన డాక్టర్ అంబేద్కర్ అన్ని వర్గాలు ఆరాధించదగ్గ మేధావి అని కొనియాడారు. ముఖ్యంగా దేశం ఏర్పడిన తొలినాళ్లలో అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆయన సమాజంలోని నిమ్న వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలందించినట్లు తెలిపారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన ఆయన ప్రపంచ మేధావులలో ఆయన ఒకరిని గుర్తు చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి ప్రతి ఒక్కరు గౌరవం ఇవ్వాల్సిందేనని, అయితే కొన్ని పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నట్లు విమర్శించారు. అయితే మొట్టమొదటి న్యాయశాఖ మంత్రిగా, సామాజిక సంఘసంస్కర్తగా, ఆర్థికవేత్తగా, న్యాయవాదిగా దళితులు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసినట్లు చెప్పారు. కాగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సమాజంలో అట్టడుగున నిలిచిన దళిత బహుజనుల సంక్షేమానికి పెద్దపీట వేసి అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.



WWW.PRAJASWARAMDAILY.COM

# గ్రామ ప్రజల ఆదరణే నా బలం

- పొద్దుటూరు సర్పంచి అభ్యర్థి బండ లక్ష్మి, నర్సింహా
- "కత్తెర" గుర్తుతో మరోసారి బరిలోకి
- అధిక నిధులతో మరింత గ్రామాభివృద్ధి చేస్తా




**శంకర్ పల్లి డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

పొద్దుటూరు గ్రామ సర్పంచి ఎన్నికల బరిలో నిలిచిన బండ లక్ష్మి, నర్సింహా గ్రామ ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరణ, విశ్వాసం మరువలేనివని ఉద్ఘాటించారు. సర్పంచి పదవికి పోటీ చేస్తున్న ఆమె, ఈ ఎన్నికల్లో విజయం సాధించి, గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. కత్తెర గుర్తుల కేటాయింపు సందర్భంగా ఎన్నికల అధికారుల నుంచి ఆమెకు 'కత్తెర' గుర్తును అందుకున్నారు. ఈ సందర్భంగానే ఆమె మీడియాతో మాట్లాడారు. గతంలో మా కుటుంబం నుండి సర్పంచ్ ఎంపిటిసి ఉప సర్పంచిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, ఎల్లప్పుడూ మా కుటుంబానికి గ్రామానికి ప్రజలు దీవెనలు ఉన్నాయని లక్ష్మి, నర్సింహా తెలిపారు.

**అధిక నిధులు తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం...**

ఈసారి ఎన్నికల్లో గెలిస్తే, గ్రామాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. నామినేషన్ వేసినప్పటి నుంచి గ్రామ ప్రజల నుంచి వస్తున్న అపూర్వమైన ఆదరణ చూస్తుంటే, వారి దీవెనలు నాకు ఉన్నాయని అర్థమవుతోందన్నారు. ఈ ఎన్నికల్లో నేను గెలిస్తే, నా వార్డు సభ్యులతో కలిసి, పొద్దుటూరు గ్రామాభివృద్ధి కోసం అధిక నిధులనైనా సరే తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మెరుగైన మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం విషయంలో రాజీ పడకుండా కృషి చేస్తాను అన్నారు. రాబోయే ఐదేళ్లలో పొద్దుటూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా అజెండా అని లక్ష్మి, నర్సింహా ప్రకటించారు. తనకు కేటాయించిన 'కత్తెర' గుర్తును ఓటర్లు గుర్తించుకుని, భారీ మెజారిటీతో తనను గెలిపించాలని ఆమె గ్రామస్తులను అభ్యర్థించారు. గ్రామస్తుల నమ్మకాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకుంటానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.




# సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న మందలపల్లి మసీద్ కమిటీ

**అశ్వరావుపేట డిసెంబర్ 6(ప్రజాస్వరం):**

మందలపల్లి ప్రకాష్ నగర్ కాలనీ వాసులు సుంకెల వెంకటేశ్వరరావు గారు( రాణి గారి భర్త) మృతి చెందడం వలన ఎస్.కె అజీమ్ షాప్ నందు మృతదేహాన్ని ఉంచి సహృదయంతో వారి కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తూ సానుభూతి తెలియజేస్తు, అంతిమ యాత్ర కార్యక్రమం లోను పాలుపంచుకుంటున్న మైనార్టీ సోదరులు వారితోపాటు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రకాష్ నగర్ కాలనీవాసులు వారు అందిస్తున్న



సేవా కార్యక్రమాలకు పలువురు ప్రశంసించుచున్నారు.

# ఈశ్వర చారి మృతి బాధాకరం: ఆర్జేసి కృష్ణ

**ఖమ్మం డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం ఈశ్వరా చారి ఆత్మబలిదానం చేసుకోవడం బాధాకరమని బీసీ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్ల పట్ల అనుసరిస్తున్న వైఖరి పట్ల ఆందోళన చెందిన ఈశ్వరా చారి ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందని అన్నారు.బీసీలు ఎవరూ క్షణికావేశానికి లోనుకావద్దని కోరారు.పోరాటాల ద్వారా రిజర్వేషన్లను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. భవిష్యత్ లో ఇటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధి తో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా చట్టసభల్లో బీసీ ల రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా పార్టీలు కృషి చేయాలని కోరారు.లేని యెడల భవిష్యత్ లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొమ్మా రాజేశ్వర రావు, కూరాకుల నాగభూషణం, కత్తి నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.



# పినపాకలో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- గ్రామాలకు అభివృద్ధి శక్తి' నినాదంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దూకుడు!
- మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఉధృతం
- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే పారదర్శక అభివృద్ధి సాధ్యం

**బూర్గంపాడు డిసెంబర్ 6(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరు మండల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వేగంగా దూసుకెళ్తోంది. నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు మండలంలోని విప్పల సింగారం గ్రామ పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో విస్తృత ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని, పథకాలు ప్రతి ఇంటికి పారదర్శకంగా చేరుతాయని వివరించారు. అభివృద్ధికి బలమైన నాయకత్వం అవసరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పాయం వెంకటేశ్వర్లు, గ్రామ స్థాయిలో బలమైన కాంగ్రెస్ నాయకత్వం ఏర్పడితేనే రహదారులు, డ్రైనేజీలు, వీధి వెలుగు సదుపాయాల విస్తరణ వేగవంతమవుతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులపై తక్షణ చర్యలు తీసుకునేలా వ్యవస్థ బలపడుతుందని అన్నారు. రైతులకు సబ్సిడీలు, సాగునీటి పెంపు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, యువతకు స్థానిక ఉపాధి అవకాశాల విస్తరణ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం అని చెప్పారు. గెలిచే అభ్యర్థులు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయికి అవసరమైన సమస్యల పరిష్కారంలో వంతుపాటుపడతారని హామీ ఇచ్చారు.

**ప్రధాన అభ్యర్థులు**

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున కీలక సర్పంచ్ అభ్యర్థులు: విప్పల సింగారం: పాల్వంచ రాములు కునవరం: ఏనిక శ్వేత సమితి సింగారం కలబోయిన మాధవరావు వార్డు సభ్యుల లక్ష్యం - "ప్రతి ఇంటి సమస్యకు పరిష్కారం" వార్డు సభ్యుల అభ్యర్థులు 'ప్రతి ఇంటి సమస్యకు పరిష్కారం – ప్రతి ఇంటికి అభివృద్ధి' లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సమస్యలపై శాశ్వత పరిష్కారం, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరేలా చేయడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ అభ్యర్థుల ప్రణాళికలను వివరించారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది.



ప్రచారంలో పాల్గొన్న నాయకులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, సీనియర్ నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, మైనారిటీ అధ్యక్షులు రహీం భాషా, సిపిఐ నాయకులు సా రెడ్డి పుల్లారెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మున్నా లక్ష్మీ కుమారి, జంగా మోహన్ రావు, జక్కుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు. మహిళా, యువజన విభాగాల నాయకులు కూడా భారీగా హాజరయ్యారు.

# దూకుడు పెంచిన బిఆర్ఎస్ మండల బీసీ సెల్ ప్రచార కార్యదర్శి గాజులు అంజయ్య

**వలిగొండ డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజు పల్లి లో టిఆర్ఎస్ అభ్యర్థి నీలం నరేందర్ నీతి నిజాయితీగల మనిషికి ఓటేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల బీసీ సెల్ ప్రచార కార్యదర్శి గాజుల అంజయ్య అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తుండడంతో గోపరాజు పల్లి లో కాంగ్రెస్ శ్రేణులు డీలపడ్డారు ఆరు గ్యారెంటీ అమల్లో విఫలం. రైతులకు యూరియా సరిపడా అందించకపోవడం పంట రుణాల మొత్తం మాఫీ కాకపోవడం పలు కారణాలతో ప్రభుత్వం పై ప్రజలు వ్యతిరేకత నెలకొన్నది అని అన్నారు. నీలం నరేందర్ బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం. ఊరి ప్రజలందరికీ ఉంటుంది సహాయం అని గాజుల అంజయ్య అన్నారు. గోపరాజు పల్లి గ్రామ ప్రజలు నరేందర్ అంటే అభిమానం.



ఓట్లన్నీ నరేందర్ కు బహుమానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు టిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఏదేమైనా ప్రజలు గెలిపించి తీరుతామని కంకణం కట్టుకున్నారు అని అన్నారు.

# బిఆర్ఎస్ కార్యకర్త మృతి, నివాళులు అర్పించిన సింగిరెడ్డి వాసంతి

**వనపర్తి, డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

జిల్లా కేంద్రం నాగవరం భారాస పార్టీ మహిళ నాయకురాలు సాయిలిల భర్త శ్రీనివాసులు శనివారం మృతి చెందారు. మృతిచెందిన వార్త విని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సతీమణి వాసంతి తీవ్ర సంతాపం తెలిపారు. మృతి చెందిన శ్రీనివాసులు స్వగృహానికి చేరుకుని అయన భౌతికకాయానికి పూలమాలలు సమర్పిస్తూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో వాసంతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ, "ఈ కష్ట సమయాన్ని ధైర్యంగా ఎదుర్కొని, కుటుంబ సభ్యులు పరస్పర సహాయంతో ముందుకు సాగాలి. మీతో మా మనసు ఉంది" అని కుటుంబానికి హృదయపూర్వక సానుభూతి తెలిపారు. మృతి చెందిన శ్రీనివాసులు భార్య సాయి లీల చాలా ఏళ్లుగా సింగిరెడ్డి కుటుంబానికి విధేయత గా ఉన్నారు.పేద కుటుంబం, అందునా ఆడపిల్లలు ఉన్నారు. ఆమెకు ఆడపిల్లల కుటుంబం కావడంతో ఆమె భర్త మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు సింగిరెడ్డి వాసంతి ముందు తీవ్ర దుఃఖంలో కోరారు. గట్టు యాదవ్, పలస రమేష్ గౌడ్ తదితర పార్టీ నేతలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



# నా జీవితం ప్రజాసేవకే

- నీలం నరేందర్ బి ఆర్ ఎస్ అభ్యర్థి

**వలిగొండ డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం బిఆర్ఎస్ అభ్యర్థి నీలం నరేందర్ గోపరాజు పల్లికి తన జీవితం ప్రజాసేవకే అంకితం అని అన్నారు. తెలంగాణ సాధనలో భాగస్వాములమైన మనము అందరము సీఎం కేసీఆర్ వల్లే సంక్షేమ ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. గ్రామ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలని లక్ష్యముతో టిఆర్ఎస్ ఆధ్వర్యంలో ముందుకు వెళ్తున్నానని అన్నారు. ఇప్పటికి గ్రామ సర్వేలు టిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక సహాయం చేయాలని మీ ముందుకు వస్తున్నాను అని అన్నారు. నన్ను ఆదరించండి మీకు అన్నివేళలా అందుబాటులో ఉండి నేను గ్రామానికి సేవకునిగా పనిచేస్తానని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న



నన్ను ఆదరించండి అని అన్నారు. గోపరాజు పల్లిలో సేవ చేయడమే నా లక్ష్యం నాకు ఒక అవకాశం ఇవ్వండి ప్రతినిత్యం అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని మీ అందరి సహాయ సహకారాలు మీ ఆశీర్వాదాలు నాపై ఉంచి గ్రామ సర్పంచిగా గ్రామ ప్రజలు సపోర్టు చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు.

# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

**వలిగొండ డిసెంబర్ 6(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో లో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గోపరాజుపల్లి అంబేద్కర్ సెంటర్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహనికి పూల మాల వేసి ఘనంగా నీవాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమం లో జై భీమ్ సేన అధ్యక్షులు వల్లమల్ల రత్నయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేసిన మహనీయుడు ముందు తరాలకు అనుగుణంగా రాజ్యాంగ నిర్మాణం చేసాడు అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలంటూ, ఆయన రచించిన రాజ్యాంగాని ప్రతి ఒకరు చదవల్ల ప్రతి ఒకరు చదవల్లన్నారు అన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు వల్లమల్ల రత్నయ్య ఉప అధ్యక్షులు కట్ట సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలం నరేందర్, కల్చరల్ సెక్రటరీ నీలం నరేష్, సంగిశెట్టి నర్సయ్య, మాణిక్యం రావు, నితిన్ కుమార్ పాల్గొన్నారు.



# హైతాబాద్ లో అంబేద్కర్ వర్ధంతి :నేతల ఘన నివాళులు

- నివాళులర్పించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్

**షాబాద్ డిసెంబర్ 06(ప్రజాస్వరం):**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో శనివారం ఆయన యొక్క విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించిన గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, హైతాబాద్ మాజీ సర్పంచ్ మహమ్మద్ కాజమియా పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మొహమ్మద్ జహంగీర్, నాయకులు అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, బుడి గారి సత్తయ్య, దేవుల, శేఖర్, కుమ్మరి కృష్ణ, కుమ్మరి శాంతప్ప, శ్రీధర్, శ్రీనివాస్, కృష్ణ, రామస్వామి, మల్లయ్య, రవి మామ జానీ పులిగారి రవి, మహమ్మద్ గౌస్, పాషా, కుమ్మరి బాలయ్య, చాకలి మహేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.





## అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించిన పామేన భీమ్ భరత్

**రంగారెడ్డి జిల్లా డిసెంబర్ 06(ప్రజాస్వరం):** రాజేంద్ర నగర్ నియోజక వర్గం కాటేదాన్ లో ఎస్సి, ఎస్ టి, బీసీ చైతన్య వేదిక వారి ఆధ్వర్యంలో భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి శనివారం భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక సమత్వానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన భారతరత్న డా. భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ మనం స్మరించుకుంటూ, ఘన నివాళి అర్పించారు. వీరితో పాటుగా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ మాట్లాడుతూ డా. అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక యుగకర్త, జ్ఞాన జ్యోతి, సమానత్వ సిద్ధాంతానికి ప్రతీక. రాజ్యాంగ నిర్మాతగా ఆయన అందించిన రాజ్యాంగం మన దేశానికి ఆత్మ ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని, న్యాయాన్ని అందించిన మహనీయుడు. సామాజిక విప్లవకారుడిగా అంటరానితనం, కులవివక్ష అనే చీకట్లను పారద్రోలి, కోట్లాది మంది అణగారిన ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన ఆశాదీపం. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా ఆయన మేధస్సు, ఆలోచనలు నేటికీ ఎంతోమందికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. ఆయన చూపిన మార్గంలో పయనించడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళిసమాజంలో సమానత్వం, న్యాయం, విద్య అందరికీ అందేలా కృషి చేయాలని, ఆయన ఆశయాలను మనసా, వాచా, కర్మణా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

## అక్రమాలకు పాల్పడుతున్న సబ్ రిజిస్టార్ పై చర్యలు తీసుకోవాలి

**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 06(ప్రజాస్వరం):** ఇబ్రహీంపట్నం ఇంచార్జ్ సబ్‌రిజిస్టార్ సోని అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ భూ పరిరక్షణ సమితి సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర స్టాంప్, రిజిస్ట్రేషన్ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ఆమె పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కాగా యాచారం మండలం కుర్మిద్ద గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 332 లోని ప్లాట్లను ఎలాంటి కోర్టు కేసు లేకుండా ఇబ్రహీంపట్నం ఇంచార్జ సబ్ రిజిస్టర్ సోని నిషేధిత జాబితాలో 2024 డిసెంబర్ లో చేర్చి బాధితులు హై కోర్టుకు వెళ్లిన తర్వాత మళ్ళీ నిషేధిత జాబితా నుంచి తొలగించారని ఆరోపిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ లకు ఇన్చార్జి సబ్ రిజిస్టర్ డి.సోని పై చర్యలు తీసుకోవాలని భూ పరిరక్షణ సమితి సభ్యులు ఫిర్యాదు చేశారు.



## తీన్మార్ మల్లన్న హౌస్ అరెస్ట్

**హైదరాబాద్ డిసెంబర్ 06(ప్రజాస్వరం):** జర్నలిస్ట్, ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నను శనివారం తెల్లవారుజామున పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పీర్జాదిగూడలోని చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లోని అతని నివాసం చుట్టూ రాచకొండ పోలీసు సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు. అతను ఆవరణ నుండి బయటకు వెళ్లకుండా సమర్థవంతంగా నిరోధించారు. వెనుకబడిన తరగతులకు (బీసీలు) 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆత్మహత్య చేసుకున్న బీసీ కార్యకర్త సాయి ఈశ్వర్ చారి అంత్యక్రియల దృష్ట్యా అధికారులు ఆయనను గృహ నిర్బంధంలో ఉంచినట్లు భావిస్తున్నారు. ఈ చర్య అనేక మంది బీసీ సంఘాల నాయకుల నుండి విమర్శలకు దారితీసింది. వారు గృహ నిర్బంధాన్ని అన్యాయమని ఖండించారు. తనను గృహ నిర్బంధం చేయడంపై మల్లన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.



# పరకామణి చోరీ చిన్న దొంగతనమా?... సెటిల్ చేయడానికి జగన్ ఎవరు?

- **పరకామణి చోరీపై జగన్ వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయన్న చంద్రబాబు**
- **బాబాయి హత్య తరహాలోనే దేవుడి సొమ్ముతో సెటిల్మెంట్లా అని ఫైర్**
- **రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టీకరణ**
- **నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించిందని వ్యాఖ్యలు**

**విశాఖపట్నం, డిసెంబర్ 6(ప్రజాస్వరం):** తిరుమల శ్రీవారి పరకామణి చోరీని 'చిన్న దొంగతనం'గా అభివర్ణిస్తూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని, జగన్‌కు దేవుడన్నా, భక్తులన్నా, ఆలయాల పవిత్రత అన్నా ఏమాత్రం లెక్కలేదని మండిపడ్డారు. శనివారం నాడు అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు.

"బాబాయి హత్యనే సెటిల్ చేసుకుందామని చూసిన వ్యక్తి, ఇప్పుడు పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూడటం కంటే ఘోరం ఉంటుందా?" అని చంద్రబాబు ప్రశ్నించారు. దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు తిరిగి చెల్లించాడు కదా, తప్పేముందని జగన్ వాదించడం అనైతికమని అన్నారు.

"భక్తులు ఎంతో భక్తితో సమర్పించిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్మెంట్ ఏంటి? రూ.72 వేలు అనేది చిన్న మొత్తమే కావచ్చు, కానీ దేవుడి హుండీలో చోరీ చేయడం చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా?" అని చంద్రబాబు నిలదీశారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడటం ఘోరమని, జగన్ వ్యాఖ్యలపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని తెలిపారు.

**నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించింది**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి మొహమాటాలకు తావులేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను సైతం నేరమయం చేసిందని, నేరస్తులను పెంచి పోషించిందని ఆరోపించారు. నెల్లూరులో లేడీ డాన్లు తయారవడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు.



ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు, విజయనగరం లాంటి జిల్లాల్లో గతంలో ఎలాంటి అధికారులను ఎస్పీలుగా నియమించినా సరిపోయేది. కానీ గత ఐదేళ్ల పాలనలో అక్కడ కూడా నేరస్తులు తయారయ్యారు. నెల్లూరులో ఏకంగా లేడీ డాన్లను తయారు చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి సంస్కృతిని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. నేరస్తులను ఏరివేస్తాం, రౌడీలను అణిచివేస్తాం" అని హెచ్చరించారు.

**రాజధాని పనుల్లో వేగం... విద్యారంగంలో మార్పులు**

రాజధాని అమరావతి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, దీంతో నిర్మాణ పనుల్లో వేగం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఇటీవల తాను రైతులతో నిర్వహించిన సమావేశం సత్ఫలితాలనిచ్చిందని, రెండో దశ భూ సమీకరణకు కూడా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, ప్రభుత్వం సంతోషంగా ఉంటే కొందరికి మాత్రం కడుపు మండుతోందని పరోక్షంగా విమర్శించారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' ఒక బ్రాండ్‌గా మారిందని, విద్యాశాఖలో నారా లోకేశ్ తీసుకువస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చంద్రబాబు వివరించారు.

## ఇద్దరు భార్యలతో నామినేషన్లు... ఏ భార్యను సర్పంచ్ చెయ్యాలనే సందిగ్ధంలో భర్త!

**సిద్దిపేట, డిసెంబర్ 06(ప్రజాస్వరం):** సర్పంచ్ పదవికి నామినేషన్ లో ఎన్నో ఘటనలు చోటు చేసుకుంటూ ఉన్నాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. నవంబర్ నెల 30న తన మొదటి భార్యతో సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు వేయించారు. నామినేషన్ పత్రాల్లో ఏవైనా తప్పులు ఉంటే స్క్రూటినీలో ఎక్కడ తొలగిస్తారోనన్న భయంతో రెండో భార్యతో మరో నామినేషన్ వేయించారు. నామినేషన్ల దాఖలు ముగిసే సమయానికి ఈ ఇద్దరే పోటీలో ఉన్నారు. వీరిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకుంటే సర్పంచ్ పదవి ఏకగ్రీవం కానుంది.



## పోలీసింగ్‌లో హోంగార్డులది కీలక పాత్ర

- **త్వరలో ప్రత్యేక కో ఆపరేటీవ్ సొసైటీ**
- **అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు**
- **అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు**
- **హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ప్రకటన**

**తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06(ప్రజాస్వరం) :** పోలీసింగ్‌లో హోంగార్డులది కీలక పాత్ర అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సీ. సజ్జనార్ అన్నారు. హోంగార్డుల సంక్షేమం కోసం త్వరలోనే హైదరాబాద్‌లో ప్రత్యేక కో ఆపరేటీవ్ సొసైటీని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పెట్లబుర్జులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, హైదరాబాద్ కమిషనరేట్‌లో 5 వేల మంది హోంగార్డులు సేవలు అందిస్తున్నారని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణలో వారు కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. త్వరలోనే హోంగార్డుల కోసం ప్రత్యేక కో ఆపరేటీవ్ సొసైటీ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పిన కమిషనర్, ఇప్పటికే 2 వేల మంది దాంట్లో సభ్యత్వం తీసుకున్నారన్నారు. అర్హులైన హోంగార్డులకు కమిషనరేట్ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు తెలిపారు. ప్రతి హోంగార్డు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలని సీపీ సూచించారు. లేనిపక్షంలో, దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదాల బారిన పడితే అందాల్సిన బీమా డబ్బును అందించటంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. అంకితభావంతో పని చేసే వారికి ప్రోత్సాహకాలు ఉంటాయని చెబుతూనే, విధి నిర్వహణలో అలసత్వం కనబరిచినా, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్రమశిక్షణతో పని చేయటం ద్వారా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పరేడ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారితోపాటు విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 25 మంది హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందచేశారు. అలాగే, విధి నిర్వహణలో చనిపోయిన 18 మంది హోంగార్డుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఏఆర్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, హోంగార్డ్స్ కమాండెంట్ కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్‌పై పోరుబాట

- **నేడు బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా**
- **పాల్గొననున్న నేతలు, పార్టీ శ్రేణులు**
- **కాంగ్రెస్ రెండేళ్ల పాలనకు నిరసనగా ధర్నా**

**తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06(ప్రజాస్వరం) :** రెండేళ్లుగా అమలు కాని హామీల కోసం ప్రజా వంచన కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ బీజేపీ మహా ధర్నాను ఆదివారం చేపట్టనుంది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదంటూ కాంగ్రెస్ సర్కార్‌పై పోరుబాట చేస్తున్నట్లుగా తెలిపింది. ఈ మేరకు నేడు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే.అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేఎల్సీ నేత ఏవీఎన్.రెడ్డితోపాటు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు, పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో పాల్గొననున్నారు.

**మాయమాటల కాంగ్రెస్ : రాంచందర్ రావు**

అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా రైతు భరోసా లేదు, రూ.1000 పింఛన్ జాడ లేదు, విద్యార్థులకు భరోసా లేదు. "మాయ మాటల" కాంగ్రెస్ పాలనను ఎండగట్టేందుకు, ప్రజా సమస్యలపై గళ మెత్తేందుకు సిద్ధం కండి అంటూ రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. నిరుద్యోగులు, రైతులు, మహిళల పక్షాన ప్రశ్నిస్తున్న బీజేపీకి మద్దతుగా ఇందిరా పార్క్ వద్దకు పెద్ద ఎత్తున కదిలి రండి అని కోరారు.




## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు అదిరిపోవాలి

- **హెలికాప్టర్ నుంచి సీఎం ఏరియల్ వ్యూ**
- **అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

**తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06(ప్రజాస్వరం) :** అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ, తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు వేదిక కానున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9వ తేదీల్లో జరగనున్న సమ్మిట్ ప్రాంగణాన్ని సీఎం శనివారం సాయంత్రం సందర్శించారు. తొలుత హెలికాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా ప్రాంగణాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి, ఆ తర్వాత ప్రాంగణానికి చేరుకుని గంటకుపైగా ప్రతి హాల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ సదస్సులు, స్టాళ్ల కోసం ఏర్పాటు చేసిన హాళ్లను రేవంత్ నిశితంగా పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవనం, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ప్రదర్శించనున్న డిజిటల్ స్క్రీనింగ్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున వారికి స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని సీఎం అధికారులకు సూచనలు చేశారు. సీటింగ్, ఫైర్ సేఫ్టీ, వాహన రాకపోకలు, ఇంటర్నెట్ వంటి ప్రతి అంశంలో తీసుకున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి అంశంపైనా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుందూరు జయ్‌వీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999